

ప్రభుత్వ సలహాదారుడు హర్కార వేణుగోపాల్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్
-సైదాబాద్,ఆంధ్రజ్యోతి

'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్'గా.. ప్రభుత్వ ఆస్పత్రులు



ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా మారిన బడంగ్‌పేట్ యూపీహెచ్‌సీ, బాలాపూర్ యూపీహెచ్‌సీ, లెనిన్‌నగర్ పల్లె దవాఖానా

- యూపీహెచ్‌సీలు, పల్లె దవాఖానాల పేర్లు మార్పు
- ట్యాగ్‌లైన్‌గా 'ఆరోగ్యం పరమం ధనమ్'
- బాలాపూర్, బడంగ్‌పేట్‌లలో బోర్డులు మార్చిన అధికారులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా, పల్లె దవాఖానాలుగా కొనసాగిన ప్రభుత్వ ఆస్పత్రుల పేర్లు మారిపోయాయి. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఇటీవల తీసుకున్న నిర్ణయం మేరకు వాటిని ఇకపై 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్'లుగా పిలువనున్నారు. దానికి 'ఆరోగ్యం పరమం ధనమ్' అనే ట్యాగ్‌లైన్ (ఉప శీర్షిక) కూడా పెట్టారు. ఈమేరకు అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, పల్లె/బస్తీ దవాఖానాల పేర్లు మార్చే ప్రక్రియ మొదలుపెట్టారు. ఈ నెలాఖరులోగా పేర్ల మార్పు పూర్తి చేసి, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలంటూ ఆదేశాలు జారీ అయిన నేపథ్యంలో.. మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని ఆస్పత్రుల పేర్లు సైతం మార్చేశారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ పేరు మార్పు ప్రక్రియ చేపట్టారు. తమ ఆరోగ్య కేంద్రాల పేర్లు మార్చిన తర్వాత వాటి ఫోటోలు తీసి కేంద్ర ఆరోగ్య శాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసినట్టు బాలాపూర్, బడంగ్‌పేట్ ఆస్పత్రుల వైద్యాధికారిణిలు డాక్టర్ బాలమణి, డాక్టర్ రజని తెలిపారు.

బస్తీ దవాఖానాలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



బస్తీ దవాఖానా పర్యవేక్షణలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి, తదితరులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ మందిర్ బస్తీ దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని బీఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సాహెబ్ నగర్‌లోని ఆయుష్మాన్ మందిర్ బస్తీ దవాఖానాను సందర్శించి రోగులకు అందే వైద్యసేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీ దవాఖనకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనీష, జిల్లా క్వాలిటీ మేనేజర్ అర్జున్, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన

మండలంలోని 18 గ్రామాలకు ప్రత్యేక అధికారుల నియామకం

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల ఐదేళ్ల పదవీ కాలం గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని 18 గ్రామాల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. ప్రభుత్వం ఒక్కో గ్రామానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు ఎంపీడీవో మమతాబాయ్ తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్, ఇనాంగూడ ప్రత్యేక అధికారిగా పి.మమతాబాయ్, అనాజ్‌పూర్, లష్కర్‌గూడ ప్రత్యేక అధికారిగా రవీందర్‌దత్తు, బాటసింగారం, జాఫర్‌గూడ, పిగ్లీపూర్ ప్రత్యేక అధికారిగా పి.వినీత, మజీద్‌పూర్, గుంతపల్లి, గండిచెరువు ప్రత్యేక అధికారిగా ఎండీ తస్నీన్ రాజా, కవాడిపల్లి, బలిజగూడ ప్రత్యేక అధికారిగా జి.పావని, బండరావిరాల, చిన్నరావిరాల ప్రత్యేక అధికారిగా జి.వినోద, గౌరెల్లి, బాచారం ప్రత్యేక అధికారిగా వై.రామకృష్ణ, తారామతిపేట ప్రత్యేక అధికారిగా పి.కవిత, కుత్బుల్లాపూర్ ప్రత్యేక అధికారిగా సూర్యతేజ నియమితులయ్యారు.



జీఓ 46 బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

ఇచ్చిన మాట నిలబెట్టుకోండి

- జీఓ 46 బాధితులు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ 46ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేదంటే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడిస్తామని జీఓ 46 బాధితులు ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. శుక్రవారం సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్‌హోం ఆవరణలో వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జీఓ 46ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాటను తప్పాలని చూస్తున్నదని వారు ఆరోపించారు. రాబోవు రెండు మూడు రోజుల్లో ప్రభుత్వం నుంచి సానుకూలంగా ప్రకటన రాకపోతే ముందుగా మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే వచ్చే ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున నిలబడే అభ్యర్థులకు వ్యతిరేకంగా ప్రచారం చేసి ఓడిస్తామని వారు తేల్చి చెప్పారు. మా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందో అర్థంకావడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, అనీల్, నవీన్, ప్రవీణ్, ఆకాష్, శంకర్, మధు, వెంకట్‌రాముడు, శ్రీకాంత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



న్యూపద్మానగర్‌కాలనీలో కొనసాగుతున్న బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని న్యూపద్మానగర్ కాలనీలో కొనసాగుతున్న బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనులను శుక్రవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాక్స్‌డ్రైన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్, ఎస్ఎన్‌డీపీ అధికారులను కోరారు. నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, పనులు సకాలంలో పూర్తి అయితే ప్రజలకు వరద ముంపు సమస్య నుంచి విముక్తి లభిస్తుందన్నారు. డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఒకొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని, బాక్స్‌డ్రైన్ పనుల నేపథ్యంలో ప్రజలకు కొంత అసౌకర్యం ఏర్పడిందన్నారు.

బాక్స్‌డ్రైన్ ఎత్తును తగ్గించాలని ప్రజలు కోరినట్లు, అధికారులతో చర్చించిన తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. డివిజన్‌లోని ఉదయ్‌నగర్‌కాలనీ మీదుగా నిర్మించిన బాక్స్‌డ్రైన్‌ను జంక్షన్ వద్ద కలపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దేవస్థానం చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, ఎల్బీనగర్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, నాయకులు నిష్కాంత్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు యాదయ్య, విజయానంద్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఆంజనేయులు, నగేష్, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మంకాల శేఖర్‌రెడ్డి



మంకాల శేఖర్‌రెడ్డి

చంపాపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా హస్తినాపురం డివిజన్ విశ్వేశ్వరయ్య కాలనీకి చెందిన మంకాల శేఖర్ రెడ్డి నియమితులయ్యారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి శుక్రవారం మాట్లాడుతూ తనను జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు.



పరీక్ష ప్యాడ్‌లను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని ప్రభుత్వ పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు మా గురువు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ప్యాడ్స్, నోట్ పుస్తకాలు, పెన్ను, స్కేల్స్‌లను పంపిణీ చేశారు. వ్యాస రచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త సుధీర్ బికుమాండ్ల, హెచ్ఎం మాలినిరెడ్డి, వెంకటేష్‌గౌడ్, నవీన్, డి.గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిధులు కేటాయించండి

- ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్ యాదవ్



గవర్నర్‌కు భగవద్గీతను అందజేస్తున్న నక్క శ్రీనివాస్ యాదవ్

వనస్థలిపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి త్వరలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలనీ గవర్నర్ తమిళిసైని కోరినట్లు నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరి స్వామి యాదవ్, ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పన, ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ నక్క శ్రీనివాస్ యాదవ్, ఉమేష్ యాదవ్‌లు మర్యాద పూర్వకంగా గవర్నర్ తమిళిసైని కలిసి భగవద్గీతను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి తండా, తండాకు బడులు తెరవాలన్న ఆశయం ఎంతో గొప్పదన్నారు. అట్టి ఆశయాన్ని ఆచరణలో పెట్టడానికి తమ వంతుగా కృషి చెయ్యాలని గవర్నర్‌ను కోరామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండాల గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.



బైరామల్‌గూడలోని మద్దెలచెరువును పరిశీలిస్తున్న కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్

బైరామల్‌గూడ చెరువును సందర్శించిన ఆర్డీఓ

చంపాపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బైరామల్‌గూడలోని మద్దెల చెరువును శుక్రవారం కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ సందర్శించారు. చెరువు స్థలం ఆక్రమణలకు గురైనట్లు ఫిర్యాదులు, పత్రికలలో కథనాలు రావడంతో ఆర్డీఓ స్పందించారు. చెరువు విస్తీర్ణంను డిజిటల్ సర్వే చేసి రిపోర్టు అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్డీఓ హస్తినాపురం డివిజన్‌లోని రోషన్‌దౌలా బస్తీని సందర్శించారు. ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ వెంట సరూర్‌నగర్ తాహసీల్దార్ కృష్ణ, ఆర్ఐలు గీత, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

చోరీలకు పాల్పడుతున్న పాతనేరస్థుడి అరెస్ట్



ప్రశాంత్

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్థుడిని చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 17గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం కుడకుడ గ్రామానికి చెందిన గాజుల ప్రశాంత్ అలియాస్ క్రీసుదాసు (24) లేబర్ పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. కాగా బతుకుదెరువు కోసం కొద్ది నెలల క్రితం నగరానికి వలస వచ్చి షేక్‌పేట వద్ద నివాసం ఉంటున్నాడు. అయితే మద్యపానం, ధూమపానంకు బానిసైన ప్రశాంత్ జల్సాలకు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో సులువుగా డబ్బులు సంపాదించడం కోసం దొంగతనాలను మార్గంగా ఎంచుకున్నాడు. ఈ నేపథ్యంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లు, దేవాలయాలను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఈక్రమంలో చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్కాపురి భ్రమరాంబ, మల్లిఖార్జునస్వామి దేవాలయంలో మూడు రోజుల క్రితం 17 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.7వేల నగదు అపహరించుకుపోయాడు. శుక్రవారం చైతన్యపురి బస్‌స్టాపు వద్ద నుంచి అనుమానస్పద స్థితిలో వెళ్తున్న ప్రశాంత్‌ను గమనించిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. అల్కాపురి దేవాలయంతో పాటు, సూర్యాపేట టౌన్ పీఎస్ పరిధిలో 5 దొంగతనాలు, కోదాడ టౌన్ పీఎస్ పరిధిలో ఒక దొంగతనం, కట్టంగూర్ పీఎస్ పరిధిలో 2 దొంగతనాలు, కేతేపల్లి పీఎస్ పరిధిలో ఒక దొంగతనం, నార్సింగి పీఎస్ పరిధిలో 3 దొంగతనాలకు పాల్పడినట్లు తేలింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈమేరకు చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లి గ్రామ సర్పంచ్‌గా కరిమెల వెంకటేష్ ఐదేళ్ల పదవీ కాలం పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయనతోపాటు వార్డు సభ్యులను శుక్రవారం ఘనంగా సన్మానించారు.

- అబ్దుల్లాపూర్‌మెట్,ఆంధ్రజ్యోతి

అనుమతి లేని సభలు, సమావేశాలపై ఆంక్షలు

రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఏడు రోజులు పాటు అమలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముందస్తు అనుమతులు తీసుకోకుండా నిర్వహించే సభలు, సమావేశాలపై నిషేధం విధిస్తూ రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాలు జారీచేశారు. ఫిబ్రవరి 1 నుంచి 7వ తేదీ వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. సభలు సమావేశాల సందర్భంగా ర్యాలీలు తీయడం, ర్యాలీల్లో కత్తులు, జెండాలు, ఆయుధాలు ప్రదర్శించడం, బహిరంగ ప్రదేశాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగేలా సభలు, సమావేశాలు నిర్వహించడం, స్పీకర్లను వినియోగించడం, అనుమతి లేకుండా డీజేల నిర్వహణపై ఆంక్షలు విధించారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సుధీర్‌బాబు హెచ్చరించారు.

భువనగిరి ఎంపీ స్థానానికి మురళీధర్‌రెడ్డి దరఖాస్తు



భువనగిరి ఎంపీ అభ్యర్థిత్వానికి గాంధీ భవన్‌లో దరఖాస్తు చేస్తున్న మురళీధర్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరుతూ పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత చల్లూరీ మురళీధర్‌రెడ్డి శుక్రవారం గాంధీభవన్‌లో దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి తాను కాంగ్రెస్ పార్టీ విధేయుడిగా పనిచేస్తున్నానని తెలిపారు. గత 20 ఏళ్లుగా ప్రజాసేవలో ఉంటూ వివిధ హోదాల్లో ప్రజా ప్రతినిధిగా సేవలందించిన అనుభవం కూడా ఉందన్నారు. పార్టీ టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. దరఖాస్తును పరిశీలించి ఎంపీ టికెట్ తనకే కేటాయించాలని కోరారు.



డైరీని ఆవిష్కరిస్తున్న జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి

సీనియర్ సిటిజన్స్ సేవలు సమాజానికి అవసరం : కొప్పుల

మన్సూరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ సేవలు సమాజానికి ఎంతో అవసరమని, వారి అనుభవాలు నేటి యువతకు అవసరమని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ చంద్రపురి కాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటుచేసిన ఇండోర్ గేమ్స్‌ను కార్పొరేటర్ నర్సింహారెడ్డి శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ఉల్లాసానికి ఆటలు ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పి.సోమిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు, ప్రతాప్‌రెడ్డి, యాదిరెడ్డి, సుధాకర్, మధుసూదన్‌రావు, అమృత్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితునికి 5 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.4వేలు జరిమానా విధిస్తు రెండవ అదనపు సెషన్స్ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి... బాధితుడు సయ్యద్ అక్బర్ మోహెది బాఖిరి 2023 జూన్ 19న రాత్రి 9.30 గంటల ప్రాంతంలో అత్తాపూర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం సెంటర్‌లో డబ్బులు తీసుకుని బయటకు వస్తుండగా మన్‌ప్రీత్‌సింగ్ (19)ని పక్కకు జరుగు అని కోరగా గొడవకు దిగాడు. నాకు చెప్పడానికి నువ్వెవరు అతనిని చంపుతానని బెదిరించాడు. బాధితుడు ఇంటికి వెళ్తుండగా నిందితుడు తల్వార్‌తో విచక్షణారహితంగా దాడిచేశాడు. దాడిలో బాఖిరికి రక్తస్రావమవడంతోపాటు ఎడమ కన్ను చూపు పోయింది. బాధితుడు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సాక్ష్యాధారాలతో కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన రెండవ అదనపు సెషన్స్ న్యాయమూర్తి నిందితునికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.4వేలు జరిమాన విధిస్తు తీర్పు చెప్పారు.

ఆర్టీసీ కండక్టర్‌పై యువకుల దాడి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కండక్టర్
- కేసు నమోదు చేసిన పోలీసులు



హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు

హయత్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అడ్డగోలుగా బస్సు ముందు బైల్లెట్ వాహనం నడుపుతున్న యువకులను సరిగ్గా నడపమన్నందుకు ఆగ్రహించిన గుర్తుతెలియని ఇద్దరు యువకులు హయత్‌నగర్ రాఘవేంద్ర హోటల్ వద్ద ఆర్టీసీ బస్సు ఆపి డ్రైవర్‌తో గొడవకు దిగారు. తప్పు మీరు చేసి డ్రైవర్‌తో ఎందుకు గొడవపడుతున్నారని అడ్డుగా వెళ్లిన కండక్టర్‌పై ఇద్దరు యువకులు పిడిగుద్దులు గుద్దారు. వీడియో తీస్తున్న సెల్‌ను కిందపడేశారు. టికెట్లు ఇచ్చే మిషన్‌ను ధ్వంసం చేశారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హయత్‌నగర్-1 డిపోకు చెందిన అనాజ్‌పూర్ టు ఉమెన్స్ కాలేజి బస్సు శుక్రవారం అనాజ్‌పూర్ నుంచి హయత్‌నగర్ వైపునకు బయలుదేరింది. బస్సు పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు వద్దకు రాగానే ఏపీ 29 బీఎక్స్ 1818 బుల్లెట్ వాహనంపై ఉన్న ఇద్దరు యువకులు బస్సు ముందు ప్రమాదభరితంగా బుల్లెట్‌ను నడుపుతున్నారు. కొద్దిలో బుల్లెట్ వాహనం బస్సుకు తగిలేదని, సరిగ్గా నడపండని బస్సు డ్రైవర్ వారిని మందలించడంతో, అది మనస్సులో పెట్టుకున్న ఇద్దరు యువకులు బస్సు హయత్‌నగర్ రాఘవేంద్ర హోటల్ వద్ద రాగానే బస్సును ఆపి డ్రైవర్‌తో వాగ్వివాదానికి దిగారు. వెంటనే యువకులు కండక్టర్‌పై దాడి చేసి పిడిగుద్దులు గుద్దారు. సెల్ ఫోన్‌ను, టికెట్లు ఇచ్చే మిషన్‌ను ధ్వంసం చేశారు. ప్రయాణికులు వారించినా వినకుండా భయభ్రాంతులకు గురిచేశారు. వెంటనే డ్రైవర్ నవీన్, కండక్టర్ జితేంద్రకుమార్‌లు ప్రయాణీకులతో కలిసి వెళ్లి హయత్‌నగర్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు గుర్తుతెలియని యువకులపైన కేసు నమోదు చేశారు.

రెండు రోజుల వ్యవధిలోనే

రెండు రోజుల వ్యవధిలోనే ఆర్టీసీ కండక్టర్లపై దాడి జరగడం పట్ల కండక్టర్లు ఆందోళన చెందుతున్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.